లవ్ లెటర్

రచన:
శ్రీ. ఎస్. ఎల్.

ఆది తొలకరివానలు ప్రారంభించే కాలం. ఆ సాయం త్రం ఆకాశం కొంచెం మబ్బుగా వుంది. ఇంట్లో ఏమియు తోచక అలా పొలాల వెంబడి షికారుకు బయలుదేరాను. చల్లని పిల్లగాలులు నా శరీరానికి తగిలి, మనసును చక్కిలిగింతలు పెడుతోంది. ఆ చల్లని వాతావరణం ఎంతో హాయిని కలిగిస్తోంది. మళ్లలో వేసిన గంటి పైరు, పిల్లగాలికి వయ్యారంగా కదలుతూంటే, అవి మనోహరంగా కనిపిస్తోన్నాయి. ప్రక్కనే వున్న ఏతాం బావిలోనుండి, రైతు నీరు తోడుతుంటే, నీరు గలగల మని వింతశబ్దాలు చేస్తూ, కాలవలోంచి మళ్ళలోకి పారుతూంటే, అది ఒక చిన్ననదిలా కనిపిస్తోంది. కొంచెం ఎత్తున ఏపుగ ఎదిగిన చెరకుపైరు, గాలికి గల గలమని ఊగుతూ, రెట్టింపు ఉత్సాహాన్ని కలుగ చేస్తోంది. అటువంటి వాతావరణంలో, ఆ చల్లటి పిల్ల గాలికి, ఏవేవో చిన్ననాటి, పూర్వస్మృతులు; మధుర భావాలు, మనసులోంచి పైకి ఉబికి రాసాగాయి. గతంలో అపుడు...

* * *

ఇంకా నాకు హైస్కూలు చదువు ముగియలేదు. నా క్లాసుమేటు, సహాధ్యాయిని అయిన శాంతి, అతి పెంకిపిల్ల, గడుగ్గాయి. తోటి మగ విద్యార్థులంటే ఆమెకు తగనికోపం. ఉపాధ్యాయులంటే ఆమెకు గౌరవ భావం వుంది. తన చదువేమో, తన స్కూలేమో, తప్ప, ఇతరుల జోలి, సొంతి ఆమెకు అక్కరలేదు. మగరాయుడు ఎవరైనా, ఏమైనా అంటే, ఆమె వెంటనే హెడ్మాస్టరుకు రిపోర్టుచేసేది. అందువలన ఆమెను, తోటి విద్యార్థులు ఏమి అనలేక, సినిమా (ఆడ) విలిన్‌లా 'గయ్యాళి' అను బిరుదుపారేసి చక్కా నోరు మూసుకు పూరుకొన్నారు.

'కాని...ఊరుకుంటారా?...పిర్యాదు కోసం, నిక్ నేమ్‌లు తగిలించడం కోసం నా దగ్గరకు వచ్చేవారు. మా మిత్రబృందం ఉరఫ్ పెద్దలచే సార్థక నామధేయం రౌడీ సంఘం...ఒక రోజున...

'ఒరేయి!...విశ్వం. చూసావురా! అని వాడు రెండో వాడిపైపు చూసాడు.

'ఇంకేమిటి, శాంతి టెక్కూ, నిక్కూ అంటూ సాట వరసలో అంటించాడు రెండోవాడు.

'ప్చ్!...పాపం. ఇంత జరిగినా మనవాడికి చీమకుట్టి నట్లు లేదురా!' అన్నాడు పక్కవాడు.

'అబ్బే!...అది కాదురా! మనవాడు ఘోటిక అని ఫక్కున నోరు మూసుకొన్నా డొక ప్రబుద్ధుడు.

నాకు వారిమాటలతో చిన్నగా చిరుకోపం వచ్చింది. వాడివైపు కోపంగా చూసాను. వాడు మొహం ప్రక్కకు తిప్పుకుని కిసుక్కున నవ్వేశాడు.

'అరేయ్,...అబ్బీ! ను వ్వొట్టి పిరికివాడివిరా. నీకు దమ్ము లేదురా! అని అన్నాడొక ధైర్యవంతుడయిన జాంబవంతుడు.

'వాళ్ళ సంభాషణతో నాకు మతిపోయినంత పన యింది. ఏం? అన్నాను ప్రశ్నార్థకంగా;

'ఇంకా ఏమిటంటావేమిటి! మన (మగ) సంఘానికి యింత అవమానం జరుగుతూంటే, అది మనకు కాదా? అందుకనీ, ఆపేసాడు. అందుకని రెట్టించాను.

'ఆమెతో స్నేహం చేసుకొనీ...అన్నాడు రెండో వాడు.

ఊఁ చేసుకొని...

నోట్సులు, గీట్సులు, అన్నీ యిచ్చీ...

ఆఁ...ఇచ్చి?...

రెండక్షరాల మాటలతో ఆ అలనామణిని, నీ వైపు తిప్పుకొని...

ఊహుఁ...తిప్పుకొని, ఆడించాలంటావ్! అంతేనా అన్నాను.

ఆఁ...అంతే...అంతే...అన్నారంతా ఏకగ్రీవంగా.

ఇక నాకు నవ్వాగింది కాదు. వాళ్ళ తంతనానికి నవ్వాలో; ఏడవాలో తెలియక గట్టిగా నవ్వేశాను.

'ఆగరోయ్! అప్పుడే నవ్వబోకు అన్నాడొక ప్రబుద్ధుడు.

'ఏం...ఎందుకనీ' అన్నాను.

'కోపం తెచ్చుకోనంటే ఒకమాట చెప్తా'

'ఏమిటది? అన్నాను'

'మరే, మరే ఒక్క లవ్ లెటరు పారేస్తే, దానిగర్వం అణగిపోతుందనుకుంటాను. అని అన్నాడు.

'వాళ్ళ తాపత్రయానికి కొంచెం ఆశ్చర్యమేసింది. అయితే ఎవరు రాయాలంటావ్?' అని ప్రశ్నించాను.

'దాంతో వాడు ఎగిరిగెంతేసి బుర్రగోడకు తంగున గుద్దుకోగా, తడుముకుంటూ, అదే తెగక చస్తున్నాంరా అ కాస్త వుపాయం చెప్పేద్దూ, నీకు పుణ్యముంటుంది, అన్నాడు బుంగమూతి పెడుతూ ప్రక్కనున్న ఆంజనేయులుగాడు...'

'బాగా ఆలోచించాను నేను, ఆఁ...తట్టిందిరా అయిడియా'

మన వాసుగాడు రాస్తే బాగుంటుందని నా అభిప్రాయం అన్నాను. వాసువైపు చూస్తూ.

'అందరూ వాసువైపు చూసారు. అంతలావు శరీరాన్ని వుభారుగా ఒక్కసారి వూపాడు వాసు...

వాసుకూడ 'సరే' నన్నాడు దానికి అందరూ సై... అంటే సై అన్నారు.

'ఆ మర్నాడు ఒక లెటరు వాసు రాసినట్టు వుత్తరం రాసి, ఎలానో తంటాలుపడి శాంతికి అందేలా ఏర్పాటు చేసారు. ఆ వుత్తరం అందిందో లేదో, చెప్పలేదు కాని ఆ వారంరోజుల తర్వాత వాసు ఒక వుత్తరం తీసుకు వచ్చి చూపించాడు.'

మా మిత్రబృందం అంతా అతృతగ సమావేశమై, ఆ వుత్తరం యొక్క సారాంసాన్ని గ్రహించాలని పట్టుబట్టారు. ఆ వుత్తరం సారాంశాన్ని అందరకూ, చదివి వినిపించాడు నా సహాధ్యాయుడు వేణు.

'బేష్ పడిందిరా. పిట్ట అని ఎగిరి గంతేసాడు. ఒకడు'

'అరేయి అపుడే ఏం వుందిరా!' అన్నాడు మరొకడు.'

'ఇంతకీ మన వాసుగాడు అదృష్టవంతుడురా తన పుట్టినరోజు పండక్కి వ్రాసింది.' అని అన్నాను.

'ఛ...ఛ...ఆ వాసుగాడేం ఖర్మ, తలొక ప్రజెంటు పట్టుకొని, అందరమూ వెళదాం' అన్నాడు. వాసుగాడంటే, కిట్టని 'కిష్టి'గాడు.

'రైట్...రైట్ అంటూ, అందరూ దాన్ని ఆమోదించాం.'

ఆ మర్నాడు 24 వ తారీకు. శాంతి పుట్టినరోజు. మా మిత్రబృందం అంతా టిప్, టాప్...గా తయారై ఎవరికితోచిన ప్రజెంట్లు వారు పట్టుకొని, ఆ సాయంత్రం శాంతి యిల్లు చేరుకొన్నాం. 'శాంతి; మనుల్ని చూస్తూనే పలకరించి, సాదరంగా లోనికి ఆహ్వానించింది. ఆమె ఆహ్వానానికి, మురిసిపోయాం. అందరూ, 'సరే'నని లోపలికి వెళ్ళి తలొక కుర్చీలో కూర్చున్నాము. శాంతి, మా అందరికి టిఫిన్, కాఫీలు యిచ్చింది. మేము ఒకరినొకరు కళ్ళలో సంజ్ఞ చేసుకొని, తెచ్చిన ప్రజెంట్లు అమెపరం చేసాం. ఇంతలో....

'సూటూ, బూటూ, వేసుకొని నీటుగా తయారైన ఒకతను మాముందుకు వచ్చాడు. అతను శాంతి అన్న అయివుంటాడనుకొని, నమస్కారం చేసాం. అతను; ఫాంటు జేబులో నుండి, ఒక కాగితం తీసాడు. అది మేం వ్రాసిన 'లవ్ లెటర్' 'అది చూడగానే, మామిత్రుల ప్రాణాలు పైనే ఎగిరిపోయాయి. కాని అతను నాకు కొంచెం పరిచయమైనవాడే, కాబట్టి సరిపోయింది.

'అతను మావైపు తీక్షణంగా చూస్తూ' మీలో ఎవరు ఈ వుత్తరం వ్రాసింది. అని సింహాలా గర్జించాడు.

మా మిత్రబృందం నోటినుండి, మాట పెగల్లేదు. అలా శిలాప్రతిమల్లా కూర్చుండిపోయారు.

'మేము కిమ్మనక పోవడంతో, అతను మరల అందుకొని, అబ్బాయిలూ! మీరింకా చిన్నవాళ్ళు, అనుభవం లేనివాళ్ళు. ఇక ఇటువైని ఇటువంటి పిచ్చివేషాలేస్తే, ఒళ్ళు చీరేస్తాను. ఇకనుంచైనా, బుద్ధిగా వుండి, మర్యాదగా ప్రవర్తించండి. జాగ్రత్త...అంటూ తీక్షణంగా చూస్తూ బైటకు వెళ్ళిపోయాడు.

'వాసు, అలా తెలివిలేకుండా, అంతలావు శరీరాన్ని కుర్చీకి. అంటించేసాడు...'

'తస్సదియ్యా! ఏదో సరదాకిరాస్తే ఎంతపని చేసిందిరా! అంటూ ఒక్కొకరూ చల్లగా బైటకు జారుకున్నాం.'

'తలుపుచాటు నుండి శాంతి, మా అవస్థ చూసి, నవ్వుతోంది. నాక్కూడ చిన్నగా నవ్వు వచ్చింది.

'ఏం బాబూ! అలా నవ్వుతున్నారు. అని అన్నాడు. నా పక్కనుంచే పోతున్న పాలం కాపు.'

'నా ఆలోచనలు టక్కున తెగిపోయాయి. అబ్బే! ఏం లేదు అని, నా ఆలోచనకు నాకే నవ్వు వచ్చింది. తిరిగి ఆకాశంవైపు చూసాను. ఆకాశమంతా మేఘావృతమైంది. చిన్న చిన్న జల్లులు ప్రారంభమయ్యాయి. లేచి యింటివైపున నడక సాగించాను.'

నే కల్పించుకొన్న కథను మననం చేసుకుంటూ యింట్లో ప్రవేశించాను.